www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 65 | హైదరాబాద్ | శుక్రవారం | 23-05-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీకి 4 టీఎంసీలు.. తెలంగాణకు 10.26 టీఎంసీలు

**మే 22(సిద్దిపేట పవర్):**

వేసవి నీటి అవసరాల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి ఏపీకి 4 టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీలు విడుదల చేయనున్నారు. ఈ మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలంలో 800 అడుగులు, సాగర్‌లో 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఏపీ అవసరాల కోసం సాగర్ కుడి కాల్వ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. శ్రీశైలంలో జులై నెలాఖరు వరకు 800 అడుగుల కనీస మట్టం కొనసాగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.




### మిస్ వరల్డ్ బ్యూటీస్.. కాళేశ్వరం మీద నోటీసులు..

# కాళేశ్వరాన్ని కూల్చింది వాళ్లే అని నా డౌట్..

## మేడిగడ్డ దగ్గర బాంబో లేదా మరొకటో పెట్టుంటారు

- కాళేశ్వరంపై విచారణ పూర్తయ్యాక.. నోటీసులు ఇవ్వడమేంటి?
- కాళేశ్వరంపై నిజానిజాలు త్వరలో తెలుస్తాయి
- కాంగ్రెస్ వాళ్లే కూలగొట్టి ఉంటారని నా డౌట్
- కాంగ్రెస్‌లో అలాంటి పని చేసే వాళ్లు ఉన్నారు
- మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు








**హైదరాబాద్ మే 22(సిద్దిపేట పవర్):**

మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాళేశ్వరంపై నిజానిజాలు త్వరలో తెలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. "నా డౌట్ అయితే కాంగ్రెస్ వాళ్లే కూలగొట్టి ఉంటారు.. మేడిగడ్డ దగ్గర బాంబో లేదా మరొకటో పెట్టుంటారు.. కాంగ్రెస్‌లో అలాంటి పని చేసే వాళ్లు ఉన్నారు." అని కాంగ్రెస్ నేతలపై సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని కేటీఆర్ అన్నారు. ఒక బ్యారేజీలో 2 పగుళ్లు వస్తే

మిగతా 2వ పేజీలో

## బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపిస్తోంది

- ప్రధాని మోడీ చేతుల మీదుగా బేగం పేట స్టేషన్ ప్రారంభం
- విమానాశ్రయాన్ని తలపించే విధంగా ఆధునీకరణ
- కేంద్రంతో కలిసి మరిన్ని అభివృద్ధి పనులకు రాష్ట్ర హామీ

2



## ఆపరేషన్ సింధూర్‌లో సత్తా చాటిన "అగ్నివీరులు".. అంతా 20 ఏళ్ల లోపు వారే..

- పాకిస్తాన్ దాడిని తిప్పికొట్టిన అగ్నివీరులు..
- కీలక సైనిక స్థావరాలను కాపాడిన యువ రక్తం..
- 3000 మంది అగ్నివీరులు పాల్గొన్నట్లు పేర్కొన్న రక్షణ శాఖ..
- వీరి సేవలపై ప్రశంసల వర్షం..

2



### బుల్లెట్

# దిగిందా?లేదా..

- కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- అమృత్ భారత్ పథకంలో విశేష ప్రగతి
- కొత్త రైల్వే లైన్లు మరియు
- తిరుపతి రైలు సేవల అభివృద్ధి

2



# తల్లడిల్లుతున్న దండకారణ్యం..

## మావోయిస్టులకు అతి పెద్ద దెబ్బ

- 18 నెలల్లో 330 మంది మృతి
- దండకారణ్యంపై కేంద్ర ప్రభుత్వం ఫోకస్
- సేఫ్ జోన్లలోకి చొచ్చుకెళ్లిన భద్రతా బలగాలు
- బీటలువారుతున్న నక్సల్స్ కంచుకోటలు
- బీజాపూర్,సుక్మా,నారాయణపూర్,అబూజ్‌మడ్‌పై ఉక్కుపాదం
- ముమ్మర కూంబింగ్‌తో మావోయిస్టుల ఉక్కిరిబిక్కిరి
- వ్యూహాత్మకంగా ముందుకుసాగిన భద్రతా బలగాలు
- కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్‌కౌంటర్ ఇదే తొలిసారి
- కోలుకోలేని ఎదురుదెబ్బ అంటున్న పరిశీలకులు



2





### "రహీం యార్ ఖాన్ ఎయిర్ బేస్ ఐసీయూలో ఉంది"..

- పాక్ రహీం యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది..
- భారత వైమానిక దాడిపై ప్రధాని మోడీ..
- ఆపరేషన్ సింధూర్‌లో 11 పాక్ వైమానిక స్థావరాలపై దాడి..

**రాజస్థాన్ మే 22(సిద్దిపేట పవర్):**

పాకిస్తాన్‌పై భారత్ ''ఆపరేషన్ సిందూర్'' నిర్వహించిన తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్రమోడీ గురువారం రాజస్థాన్ బహిరంగ సభలో పాల్గొన్నారు. బికనీర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాకిస్తాన్‌పై మోడీ విరుచుకుపడ్డారు. ముఖ్యంగా భారత్, పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై జరిపిన దాడుల్ని మోడీ హైలెట్ చేశారు. పాకిస్తాన్‌లోని రహీం యార్ ఖాన్ ఎయిర్‌బేస్‌కు జరిగిన విధ్వంసం గురించి మాట్లాడుతూ.. ఆ ఎయిర్‌బేస్ ''ఐసీయూ''లో ఉందని అన్నారు.ప్రధాని మోడీ మాట్లాడుతూ..'' నేను ఢిల్లీ నుండి ఇక్కడికి వచ్చినప్పుడు, బికనీర్‌లోని

మిగతా 2వ పేజీలో

## బ్యాంకర్లు ఆర్థికసాయం చేస్తే..

## సమాజానికి మరింత ఉపయోగం

- బ్యాంకర్లు సామాజిక బాధ్యత కూడా తీసుకోవాలి
- ఉద్యోగాలతో పాటు యువత స్వయం ఉపాధికీ అవకాశం కల్పిస్తున్నాం
- అందుకే.. రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభిస్తున్నాం
- ఇప్పటికే.. రూ.6250 కోట్లు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం ఇస్తుంది
- బ్యాంకర్లు ఆర్థికసాయం చేస్తే.. సమాజానికి మరింత ఉపయోగం :భట్టి విక్రమార్క

2




WWW.SIDDIPETPOWER.COM

# "కాళేశ్వరాన్ని కూల్చింది వాళ్లే అని నా డౌట్..

మొదటిపేజీ తరువాయి

ఏదో అయినట్లు చేస్తున్నారని విమర్శించారని.. కమీషన్ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాళేశ్వరం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ఘోష్ విచారణ పూర్తయిందని అని చెప్పి.. ఇప్పుడు నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు.

సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిలా ఉన్నారని విమర్శించారు. అపరిచితుడి సినిమాలోని రెమో, రాము పాత్రలు ముఖ్యమంత్రికి అబ్బుతాయన్నారు. అప్పు పుట్టలేదని రెమో అంటారు.. రూ.లక్షా 60వేల కోట్లు రాము అప్పు చేశారని వ్యాంగ్యాస్త్రాలు సంధించారు. ఉన్న డిక్లరేషన్లకే దిక్కు లేదని.. ఇప్పుడు నల్లమల డిక్లరేషన్ ఎందుకు? అని ప్రశ్నించారు. నెల రోజులుగా సీఎం మదిలో ఉన్నవి వరల్డ్ బ్యూటీస్, కేసీఆర్‌కు నోటీసుల అన్నారు. తాము కట్టిన వాటి ముందు వరల్డ్ బ్యూటీస్ ఫొటోలు దిగుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

'రాష్ట్రంలో కమీషన్ల పాలన కొనసాగుతున్నది. కమీషన్ల పనిలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. 30 శాతం కమీషన్ లేనిదే ఫైల్‌లు కదులుతలేవు. తమ ప్రభుత్వంలో ఫైల్‌లు కదలాలి అంటే మంత్రుల చెయ్యి తడపాల్సిందేనని కొండా సురేఖ చెప్పారు. మా ప్రభుత్వంలో మంత్రులు 30 శాతం కమిషన్ తీసుకుంటున్నారు ఇంకొక కాంగ్రెస్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఈ కమీషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కమిషన్. రెండు లక్షల రుణమాఫీ ఎంతమంది చేశారు?. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి.. రూ.12 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారు. రుణమాఫీ ఇచ్చింది పావు వంతే. రాష్ట్రంలో 500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితి రాష్ట్రంలో లేదు.

వరంగల్ మహాసభ విజయవంతం కాగానే నోటీసుల డ్రామా మొదలుపెట్టారు. కాళేశ్వరం ఒక ఇంజినీరింగ్ మార్వెల్ అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుంది. ఒక బ్యారేజీలో రెండు పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారు. ఈ కాంగ్రెస్, బీజేపీ దొంగలే మేడిగడ్డ దగ్గర బాంబు పెట్టి పేల్చేశారని నా అనుమానం. పాలమూరులాగే కాళేశ్వరంలోనూ నిజం తెలుస్తుంది. చిల్లిగవ్వ పుట్టడం లేదంటూనే అందాల పోటీలు పెడుతున్నారు. రాష్ట్రం దివాళా తీసిందంటూనే దుబారా ఖర్చులు చేస్తున్నరు. అందాల పోటీలు రేవంత్ రెడ్డికి, భట్టి విక్రమార్కకు మధ్య జరుగుతున్నట్టు ఉన్నాయి. మిస్ వరల్డ్ బ్యానర్ల మీద రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు ఫొటోలు చూశా.. వారిలో ఎవరు మిస్ వరల్డ్ పోటీదారులో అర్థం కాలేదు. చార్మినార్ అగ్ని ప్రమాదంపై రేవంత్ రెడ్డికి రివ్యూచేసే సమయం లేదా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటూ.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన అద్భుత కట్టడాలను అందగత్తెలకు చూపించారు. లక్షన్నర కోట్లు అప్పు చేసి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకుపోయాయి. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి లబ్ధి జరిగింది. కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. రైతుల ఖాతాల్లో రైతు బంధు పైసలు పడ్తలేవు.. కానీ ఢిల్లీలో రాహుల్ గాంధీ ఖాతాలో మాత్రం నెల నెలా టకీ టకీమని పడుతున్నాయ్. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరూ దొంగలే.. ఇద్దరినీ నమ్మొద్దు. అప్రమత్తంగా ఉండి.. ఇద్దరినీ ఎండగట్టాలి. తెలంగాణకు గుండె ధైర్యమైన గులాబీ జెండాను మల్లొక్కసారి మనమే ఎగురవేయాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తగిన బుద్ధి చెప్పాలి. ఎవరికి టికెట్ వచ్చినా ప్రతీ కార్యకర్త తనకే అవకాశం వచ్చినట్టుగా కొట్లాడాలి. మళ్లీ నిర్మల్ జిల్లాలో గులాబీ జెండా ఎగిరేవరకు పోరాడుదాం.' అని కేటీఆర్ అన్నారు.



**మేడిగడ్డను బాంబు పెట్టి పేల్చేశారు**

గతంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ పై సుప్రీంకోర్టులో ఎవరో కేసు వేశారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ గుర్తుచేశారు. అయితే దానిని న్యాయస్థానం కొట్టివేసిందని చెప్పారు. అందులో ఏం తప్పులేదని.. అంతా సక్కగానే జరిగిందని కోర్టు చెప్పిందని అన్నారు. కాళేశ్వరం అనేది ఇంజనీరింగ్ అద్భుతమని అదే సమయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించినట్లు చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్ట్‌ను బీజేపీ, కాంగ్రెస్ దొంగలే బాంబు పెట్టి పేల్చేసి ఉండొచ్చని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు వేశారు. కాంగ్రెస్, బీజేపీ రెండు తోడు దొంగలేనని.. ఎవరినీ నమ్మాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

**అందాల పోటీలతో సీఎం బిజీ**

మరోవైపు మిస్ వరల్డ్ పోటీల గురించి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. 500 మంది అన్నదాతలు చనిపోతే సీఎం రేవంత్.. అందాల పోటీల్లో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. రైతుల ఆత్మహత్యలపై సమీక్ష నిర్వహించే సమయం ముఖ్యమంత్రికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఫైల్స్ కదలాలంటే మంత్రుల చెయ్యి తడపాల్సిందేనని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్వయంగా చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వంలో మంత్రులు 30శాతం కమిషన్ తీసుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం స్పష్టం చేశారని కేటీఆర్ అన్నారు.

సీఎం.. రోజుకో మాట చెప్తున్నారు

సీఎం రేవంత్ రెడ్డిలో ఒక అపరిచితుడు దాగున్నాడని కేటీఆర్ ఆరోపించారు. ఒకరోజు కాళేశ్వరాన్ని కూలేశ్వరం అంటారని.. మరో రోజు దాని పరిధిలోని మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ కు నీరు ఇస్తామని చెబుతారని గుర్తుచేశారు. ఓ రోజు అప్పు లేదని అంటారని.. మరో రోజు అసెంబ్లీలో రూ.1,70,000 కోట్లు రుణం తీసుకున్నామని చెప్తారని కేటీఆర్ అన్నారు. ఒక రోజు కేసీఆర్ ఆనవాళ్లు తొలగిస్తామని చెప్తారని.. మరొక రోజు కేసీఆర్ కట్టిన ప్రతీది తిరిగి చూపిస్తారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 'మల్టిపుల్ పర్సనాలిటీ డిసార్డర్' అనే మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని చెప్పారు.

## బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపిస్తోంది

- **ప్రధాని మోడీ చేతుల మీదుగా బేగంపేట స్టేషన్ ప్రారంభం**
- **విమానాశ్రయాన్ని తలపించే విధంగా ఆధునీకరణ**
- **కేంద్రంతో కలసి మరిన్ని అభివృద్ధి పనులకు రాష్ట్ర హామీ**

**హైదరాబాద్ మే 22(సిద్దిపేట పవర్):**

'అమృత్ భారత్' పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ జాబితాలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సూళ్లూరు పేట స్టేషన్‌లు ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి చూస్తున్న బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా మారిందని ఆనందం వ్యక్తం చేశారు.

అలాగే, భవిష్యత్‌లో మరిన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసికట్టుగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. గట్కేసర్ నుండి యాదాద్రి వరకు భక్తుల కోసం ఎంఎంటీఎస్ సర్వీస్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ రైల్వే మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఘట్ కేసర్ - యాదాద్రి మార్గాన్ని ఆరు నెలల్లో పూర్తిచేయాలన్న దిశగా ప్రయత్నిస్తున్నామని, దీనిపై సీఎం తో చర్చించి త్వరిత క్లియరెన్స్‌కి సహకరిస్తానని తెలిపారు.

## "రహీం యార్ ఖాన్ ఎయిర్ బేస్ ఐసీయూలో ఉంది"..

మొదటిపేజీ తరువాయి

నల్ విమానాశ్రయంలో దిగాను. పాకిస్తాన్ కూడా దీనిని లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించింది కానీ వారు ఈ వైమానిక స్థావరాన్ని దెబ్బతీయడంలో విఫలమయ్యారు. సరిహద్దుకు అవతలి వైపున రహీం యార్ ఖాన్ వైమానిక స్థావరం ఉంది. ఇది ఐసియులో ఉంది. ఇది ఎప్పుడు తెరుచుకుంటుందో తెలియదు? భారత దళాలు ఈ వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేశాయి." అని అన్నారు.

" ఈ నేలపై ప్రమాణం చేస్తున్నా, భారతదేశాన్ని ఎవరి ముందు పడనివ్వను" అని అన్నారు. పవిత్ర సిందూరాన్ని తుడిచిపెట్టిన వారి అంతు చూశాము, భారతదేశ రక్తాన్ని చిందించిన వారు ఇప్పుడు మూల్యం చెల్లించుకున్నారని, భారత్ మౌనంగా ఉంటుందని భావించిన వారు ఇప్పుడు దాక్కున్నారని, తమ ఆయుధాల గురించి గొప్పలు చెప్పుకున్న వారు ఇప్పుడు శిథిలాల కింద ఖననం చేయబడ్డారని ప్రధాని మోడీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ ప్రతీకార చర్య కాదని, న్యాయం యొక్క కొత్త రూపం అని నొక్కి చెబుతూ, ఇది కేవలం ఆగ్రహాన్ని వ్యక్తపరచడమే కాకుండా భారతదేశం యొక్క అచంచలమైన బలం మరియు దృఢ సంకల్పాన్ని ప్రదర్శించిందని ఆయన వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ వైమానిక దళం పాకిస్తాన్‌లోని 11 ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేసింది. ముఖ్యంగా రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌తో సహా రఫికీ, సర్గోదా, జకోబాబాద్, కరాచీ, స్కర్దు, రహీం యార్ ఖాన్ ఇలా పలు వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ దాడి తర్వాతే పాకిస్తాన్ కాళ్ల బేరానికి వచ్చింది.

## బుల్లెట్ దిగిందా?లేదా..

- **కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ**
- **అమృత్ భారత్ పథకంలో విశేష ప్రగతి**
- **కొత్త రైల్వే లైన్లు మరియు తిరుపతి రైలు సేవల అభివృద్ధి**

**కరీంనగర్ మే 22(సిద్దిపేట పవర్):**

'గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దూరం చేసుకున్నారు. కానీ ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్నాక - ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేస్తున్నారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలి," అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.

అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం ఈపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడలేదని, ప్రస్తుతం వారానికి రెండు సార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా రూ.2 వేల కోట్లతో ఆధునీకరించిన 103 స్టేషన్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు. కరీంనగర్ స్టేషన్ కూడా వాటిలో ఒకటి. రూ.27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో సదుపాయాలు కలిగిన ఈ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఏసీ/నాన్‌ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టాయిలెట్లు, సోలార్ ప్లాంట్ వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సెల్ఫీలు తీసుకునే స్థాయికి ఇది చేరిందని ఆయన తెలిపారు.

గత 11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ.42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తి-కరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్‌లో సత్తా చాటిన "అగ్నివీరులు".. అంతా 20 ఏళ్ల లోపు వారే..

- **పాకిస్తాన్ దాడిని తిప్పికొట్టిన అగ్నివీరులు..**
- **కీలక సైనిక స్థావరాలను కాపాడిన యువ రక్తం..**
- **3000 మంది అగ్నివీరులు పాల్గొన్నట్లు పేర్కొన్న రక్షణ శాఖ..**
- **వీరి సేవలపై ప్రశంసల వర్షం..**

**న్యూఢిల్లీ మే 22(సిద్దిపేట పవర్):**

"ఆపరేషన్ సిందూర్"తో భారత్ పహల్గామ్ ఉగ్రదాడికి పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్తాన్ కేవలం 5 రోజుల్లోనే కాళ్ల బేరానికి వచ్చింది. పాక్ వైమానిక ఆస్తుల్లో 20 శాతాన్ని కోల్పోయింది. మొత్తం 11 పాక్ ఎయిర్‌బేస్‌లను భారత్ ధ్వంసం చేసింది. దీనికి తోడు పాకిస్తాన్, పీఓకే లోని లష్కరే తోయిబా, జైష్ ఏ మహ్మద్ ఉగ్రవాద కార్యాలయాలు, ట్రైనింగ్ కేంద్రాలపై భారత్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదుల హతమయ్యారు.

ఇదిలా ఉంటే, ఈ ఆపరేషన్ ఇంత విజయవంతం కావడంతో "అగ్నివీరుల" కృషి ఉందని రక్షణ వర్గాలు ప్రశంసించాయి. సుమారుగా 3000 మంది అగ్నివీరులు గన్నర్లు, ఆపరేటర్లు, భారీ వాహన డ్రైవర్లుగా తమ సేవల్ని అందించారని, వీరి పనితీరు సాధారణ సైనికులతో సమానంగా ఉందని ప్రశంసలు దక్కుతున్నాయి. వీరందరి వయసు 20 ఏళ్ల లోపే కావడం గమనార్హం. వీరందర్ని అగ్నిపథ్ పథకం ద్వారా సైన్యం రిక్రూట్ చేసుకుంది.

పాకిస్తాన్ క్షిపణి, డ్రోన్ దాడుల నుంచి భారత సైనిక స్థావరాలను రక్షించారు. కీలకమైన వాయు రక్షణ వ్యవస్థను నిర్వహించడం నుంచి పదే పదే శత్రువు దాడి చేస్తున్నప్పటికీ అనేక స్థావరాలను, నగరాలను కాపాడుకోవడంలో అగ్నివీరులు అత్యున్నత ప్రతిభను కనబరిచారు. ప్రతీ వైమానిక రక్షణ యూనిట్‌లో 150200 మంది అగ్నివీరులు ఉన్నారని, ప్రధానంగా పశ్చిమ సరిహద్దుల్లో మోహరించినట్లు సైనిక వర్గాలు తెలిపాయి.

అగ్నివీరులు ముఖ్యంగా నాలుగు విభాగాల్లో పని చేశారు. గన్నర్లుగా, ఫైర్ కంట్రోల్ ఆపరేటర్లుగా, రేడియో ఆపరేటర్లుగా, గన్స్‌క్షిపణులు అమర్చిన హెవీ డ్యూటీ వాహనాలకు డ్రైవర్లుగా పనిచేశారు. భారత తయారీ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఆకాష్‌తీర్ యాక్టివేట్ చేయడానికి, ఆపరేటర్ చేయడానికి సహాయం చేశారు.

భుజం నుంచి ప్రయోగించే క్షిపణులను, L70, Zu232B వంటి అప్‌గ్రేడ్ చేసిన యాంటీఎయిర్‌క్రాఫ్ట్ గన్‌లను నిర్వహించడం, పెచోరా, షిల్కా, OSAAK, స్ట్రెలా ,తుంగుస్కా వంటి మ్యానింగ్ సిస్టమ్‌లు, ఆకాష్ మిస్సైల్ సిస్టమ్, ఇతర ఉపరితలం నుండి గాలికి ప్రయోగించే క్షిపణులను మోహరించడం, ప్రయోగించడంలో చురుకుగా పాల్గొన్నారు.



రన్నింగ్ రాడార్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఆకాష్‌టీర్ నోడ్‌లు, కొన్ని ఆయుధ వ్యవస్థలను మోహరించిన తర్వాత ఫార్వర్డ్ జోన్‌లలో సెంట్రీలుగా కూడా వ్యవహరించాయి.

**అగ్నివీర్ పథకం:**

నాలుగు ఏళ్ల సేవల కోసం సైన్యంలో యువకులను రిక్రూట్ చేసుకునేందు కేంద్రం "అగ్నివీర్" పథకాన్ని ప్రవేశపెట్టింది. వారిలో 25% మందిని మరో 15 సంవత్సరాలు రెగ్యులర్ చేస్తారు. వీరు 17.5 ఏళ్ల నుంచి 21 సంవత్సరాల మధ్య యువత అగ్ని పథ్ స్కీమ్‌కి అర్హులు. అగ్నివీర్‌లు సర్వీస్‌లో మొదటి సంవత్సరంలో రూ.4.76 లక్షల వార్షిక జీతం, నాలుగో ఏడాదిలో రూ. 6.92 లక్షలు పొందుతారు, రూ.48 లక్షల నాన్‌కంట్రిబ్యూటరీ బీమా కవర్, సర్వీస్ కారణంగా మరణిస్తే రూ.44 లక్షల అదనపు ఎక్స్‌గ్రేషియా పొందుతారు.

సాధారణ సైనికుల మాదిరిగా, నాలుగు సంవత్సరాల తర్వాత సైన్యం నుంచి బయటకు వచ్చిన వారికి పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణ, క్యాంటీన్ వంటి ప్రయోజనాలు లభించవు. అగ్నివీరులు నాలుగేళ్ల సర్వీసు తర్వాత కేంద్ర సాయుధ పోలీస్ దళాల్లో ప్రభుత్వం 10 శాతం ఖాళీలను రిజర్వ్ చేసింది. హర్యానా, రాజస్థాన్ సహా కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే తమ పోలీసు దళాలలో అగ్నివీర్లకు రిజర్వేషన్లు ప్రకటించాయి.

## తల్లడిల్లుతున్న దండకారణ్యం ..

- **మావోయిస్టులకు అతిపెద్ద దెబ్బ**
- **18 నెలల్లో 330 మంది మృతి**
- **దండకారణ్యంపై కేంద్ర ప్రభుత్వం ఫోకస్**
- **సేఫ్ జోన్లలోకి చొచ్చుకెళ్లిన భద్రతా బలగాలు**
- **బీటలువారుతున్న నక్సల్స్ కంచుకోటలు**
- **బీజాపూర్, సుక్మా, నారాయణపూర్, అబూజ్‌మడ్‌పై ఉక్కుపాదం**
- **ముమ్మర కూంబింగ్‌తో మావోయిస్టుల ఉక్కిరిబిక్కిరి**
- **వ్యూహాత్మకంగా ముందుకుసాగిన భద్రతా బలగాలు**
- **కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్‌కౌంటర్ ఇదే తొలిసారి**
- **కోలుకోలేని ఎదురుదెబ్బ అంటున్న పరిశీలకులు**

**హైదరాబాద్ మే 22(సిద్దిపేట పవర్):**

దశాబ్దాల పాటు ఎత్తుకు పైఎత్తులు.. వ్యూహాలకు ప్రతివ్యూహాలతో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య దండకారణ్యంలో సాగుతున్న పోరు ఒక ఎత్తైతే.. నక్సల్ మిషన్ 2026 మరో ఎత్తుగా నిలిచింది. తుపాకీ మోతలు.. దూసుకొస్తున్న తూటాలతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. ఒక్కొక్కరుగా అన్నలు నేలకొరుగుతుంటే అడవితల్లి తల్లడిల్లుతోంది. ఏడాది కాలంలోనే వందలాది మంది మావోయిస్టులు తుపాకీ తూటాలకు బలయ్యారు.

**కీలక స్థావరాలపై ఫోకస్..**

వామపక్ష తీవ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. దీంతో నక్సల్స్ ఇలాకా అబూజ్ మడ్‌లో భద్రతా బలగాలు గతేడాది కాలుమోపాయి. 2024లో దండకారణ్యంలో మావోయిస్టుల సంచారంపై ఉక్కుపాదం మోపేలా ప్రతి అడుగూ వ్యూహాత్మకంగా వేస్తూ వచ్చాయి. మావోయిస్టులకు ప్రధాన స్థావరాలుగా ఉన్న బీజాపూర్, సుక్మా, నారాయణపూర్, అబూజ్‌మడ్ ప్రాంతాల్లో ముమ్మర కూంబింగ్‌తో మావోయిస్టులను ఉక్కిరిబిక్కిరి చేశారు.



**డ్రోన్లు, హెలికాప్టర్లతో ఆపరేషన్..**

మావోయిస్టులకు పెట్టని కోటలుగా ఉన్న దండకారణ్యంలోని ప్రాంతాల్లోనూ కేంద్ర బలగాలు పాగా వేసుకుంటూ ఆపరేషన్‌ను కొనసాగించాయి. ఇక మావోయిస్టులకు ప్రధాన కేంద్రంగా ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టేందుకు ఏకంగా 24 వేల మంది భద్రతా బలగాలను రంగంలోకి దింపి, హెలిక్యాప్టర్లు, ప్రత్యేక రోబోట్‌లు, డ్రోన్లతో ఆపరేషన్ చేపట్టాయి. దాదాపు 20 రోజుల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు చనిపోయారు.

**అత్యంత ప్రతిష్ఠాత్మకంగా**

2024 జనవరి నుంచి మొదలుపెట్టిన నక్సల్ మిషన్ 2026ను భద్రతా బలగాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయని ఉమ్మడి ఏపీ విశ్రాంత డీజీపీ హెచ్.జె.దొర అన్నారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. డ్రోన్ల వినియోగం, హెలికాప్టర్ల వినియోగంతో కీకారణ్యంలోనూ మావోయిస్టుల జాడ తెలుసుకుని విరుచుకుపడ్డాయని వివరించారు. దండకారణ్యంలో ఏడాదికి పైగా హోరాహోరీగా సాగిన పోరులో భద్రతా బలగాలే పైచేయి సాధించాయని స్పష్టం చేశారు.

**మావోయిస్టు చరిత్రలో..**

2024లో జరిగిన ఎన్ కౌంటర్లలో 215 మంది మావోయిస్టులు మృతిచెందారు. 2025 జనవరి నుంచి మే 21 వరకు 115 మంది హతమయ్యారు. మొత్తంగా మావోయిస్టు పార్టీ చరిత్రలో ఒక్క ఏడాదిన్నరకాలంలో 330 మావోయిస్టులు మృతిచెందడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

## బ్యాంకర్లు ఆర్థికసాయం చేస్తే.. సమాజానికి మరింత ఉపయోగం

- **బ్యాంకర్లు ఆర్థికసాయం చేస్తే.. సమాజానికి మరింత ఉపయోగం**
- **బ్యాంకర్లు సామాజిక బాధ్యత కూడా తీసుకోవాలి**
- **ఉద్యోగాలతో పాటు యువత స్వయం ఉపాధికీ అవకాశం కల్పిస్తున్నాం**
- **అందుకే.. రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభిస్తున్నాం**
- **ఇప్పటికే.. రూ.6250 కోట్లు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం ఇస్తుంది**
- **బ్యాంకర్లు ఆర్థికసాయం చేస్తే.. సమాజానికి మరింత ఉపయోగం :భట్టి విక్రమార్క**

**హైదరాబాద్ మే 22(సిద్దిపేట పవర్):**



జూన్ 2వ తేదీన ఐదు లక్షల యువతకు రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్న లక్ష్యాన్ని సమయానికి సాధించేందుకు బ్యాంకర్ల సహకారం అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (SLBC) సమావేశంలో ఆయన 2025 26 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవడం ముఖ్యమని అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఐదు లక్షల యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.6,250 కోట్లు సబ్సిడీతో ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. యువతను ఉత్పత్తి రంగంలోకి తీసుకువచ్చి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తోడ్పడేలా పథకం రూపొందించామని తెలిపారు.

రాజీవ్ యువ వికాసం పథకం సజావుగా అమలవడానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారి నియమించి సమన్వయం చేయాలని, పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రత్యేకంగా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకాలు అందిస్తోందని, ఆయిల్ ఫామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి రూ.21 వేల కోట్లను బ్యాంకుల్లో జమ చేసి రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నట్టు తెలిపారు. అలాగే రైతు బీమా ప్రీమియం డబ్బులు ప్రభుత్వం కట్టుతుందని తెలిపారు.

అదివి బిడ్డల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఇన్‌దిరా సౌర గిరి జల వికాస పథకం రూపకల్పన చేసి, రూ.12,600 కోట్లు ఖర్చు పెట్టి ఆరు లక్షల 70 వేల ఎకరాలలో సౌర విద్యుత్తును సాగులో ఉపయోగించాలని ప్రణాళిక చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్షల కోట్లు వడ్డీ రహిత రుణాలుగా ఇస్తూ మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నామని, పరిశ్రమల కోసం ట్రైనింగ్ అందిస్తున్నామని తెలిపారు. మూసీ నదిని పునర్జీవం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య పారిశ్రామిక అభివృద్ధి కోసం వివిధ క్లస్టర్ల ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు.

# వరి వేస్తే "ఉరి" అన్న బిఆర్ఎస్ నేతలకు సిగ్గుండాలి

- గ్రామాల్లో తిరగడం కాదు, దమ్మంటే కేసీఆర్ ఫాంహౌజ్ వీడేలా చేయండి
- ఏకకాలంలో రూ 2 లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ కే దక్కింది
- కాళేశ్వరం అవినీతితో కెసిఆర్ జైలుకెళ్లడం ఖాయం
- అందుకే... అన్నదాతలను రెచ్చగొడుతున్న పనికిమాలిన నేతలు
- కేవలం మూడు రోజుల్లోనే... రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు
- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

జిల్లా యంత్రాంగం ప్రత్యేక కృషితో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతూ మూడు రోజుల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తుండగా, పనికి మాలిన బిఆర్ఎస్ నేతలు రైతులను రెచ్చగొడుతున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపిస్తుండగా, జీర్ణించుకోలేని కొందరు నేతలు గతాన్ని మరిచి దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ నేతలను చీపుర్లు, చెప్పులతో కొట్టడం ఖాయమని అన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ప్రజాధనాన్ని గత 18 నెలలుగా వేతనం, ఇతర అలవెన్సులు పొందుతూ గజ్వేల్ ప్రజలను పట్టించుకోవడంలేదని ఎద్దేవా చేశారు. అయితే ప్రతిపక్ష నేత హోదా కలిగిన ఆయనను బయటకు తేలేని ఈ దద్దమ్మ నేతలకు కాంగ్రెస్ సర్కార్, సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదని నిలదీశారు. వరి వేస్తే ఉరే అన్న బిఆర్ఎస్ నేతలు, ఇప్పటి ఎమ్మెల్సీ, అప్పటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డిని ముందు నిలదీసి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు రావాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రైతులు సంతోషంగా ఉండడాన్ని జీర్ణించుకోలేని గజ్వేల్ బిఆర్ఎస్ నేతలు తమ ఉనికి కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుండగా, కాళేశ్వరం అవినీతితో కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని తెలిపారు. గత పదేండ్ల కాలంలో కేసీఆర్ కేవలం రూ. లక్ష రుణమాఫీ చేయకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.రెండు



లక్షలు పంట రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించి రూ. లక్షల కోట్లు దోచుకున్న కెసిఆర్ కుటుంబానికి గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అండగా నిలుస్తుండడాన్ని ప్రజలు గుర్తించాలని చెప్పారు. గజ్వేల్ లోని అర్హులైన పేదలకు ఇండ్లు ఇవ్వలేని ఈ పనికిమాలిన నేతలు ఏ ముఖం పెట్టుకొని తిరుగుతున్నారని ప్రశ్నించారు. అదేవిధంగా గజ్వేల్ అభివృద్ధి, ముంపు బాధితులు, నిర్వాసితుల పేరిట జరిగిన వందల కోట్ల అవినీతిపై త్వరలోనే ఫిర్యాదు చేసి దర్యాప్తు జరిపిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో కమిషన్ల కోసం గ్రూపులు కట్టిన ఈ నేతలు గ్రామాల్లో తిరుగుతుండడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నట్లు వివరించారు.



## అణగారిన వర్గాల తొలి వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

**ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** భారత దేశ చరిత్రలో అణగారిన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన తెలంగాణ తొలి దళిత కిరణం భాగ్యరెడ్డి వర్మ అని సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. గురువారం రాయపోల్ మండలం కేంద్రంలో భాగ్యరెడ్డివర్మ 137 వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తూ తోటి సమాజంతో ఆత్మగౌరవంగా జీవించడానికి నడుం బిగించిన మహనీయులు భాగ్యరెడ్డి వర్మ అన్నారు. సామాజిక న్యాయం కోసం తొలి పునాది రాయి వేసి తన ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేసిన మహా నాయకులు, హైదరాబాద్ దక్కన్ పీఠభూమి పుత్రుడు తొలి దళిత కిరణ మాదిరి భాగ్యరెడ్డి వర్మ అన్నారు. హైదరాబాద్ లోని ఇసామియ బజార్ లో మాదరి రంగమాంబ వెంకయ్యలకు 22 మే 1888 లో భాగ్యరెడ్డి వర్మ జన్మించారు. ఆయన దళిత అణగారిన వర్గాల తొలి సూర్యుడై ఆత్మగౌరవ పోరాటానికి పునాది వేశారు. దేశంలో అణగారిన వర్గాల సమానత్వం కోసం వివిధ ప్రాంతాలలో పోరాటాలు చేస్తున్న మహాత్మ జ్యోతిరావు పూలే, నారాయణ గురు, పెరియార్ రామస్వామి డా.బి.ఆర్.అంబేద్కర్ వంటి మహనీయులతో కలిసి పని చేసిన గొప్ప నాయకుడు భాగ్యరెడ్డి వర్మ అన్నారు. దళితుల కోసం పని చేస్తూనే సమాజంలో దురాచారాలైన మద్యపాన నిషేధం, బాల్య వివాహాల వ్యతిరేక పోరాటం జోగిని వ్యవస్థ రద్దు చేయాలని సమాజంలో మూఢనమ్మకాలు తొలగించడానికి ఆయన వంతు కృషి చేశారు. ప్రధానంగా నిజాం ప్రభుత్వ హయంలో ఉర్దూ మీడియం పాఠశాలలు ఉన్న సమయంలో బాలికల కోసం ప్రత్యేకంగా 1924 వ సంవత్సరంలో 26 తెలుగు మీడియం పాఠశాలలో ప్రారంభం చేసిన గొప్ప త్యాగశీలి మాధురి భాగ్యరెడ్డి వర్మ అన్నారు. నేటి దళిత, బహుజనుల అందరూ ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జర్నలిస్ట్ పుట్ట రాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్, ఇమ్రాన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అలిరాజపేట గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

**గజ్వేల్ ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి**


**సిద్ది పేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** జగదేవపూర్ మండలంలోని అలీరాజపేట గ్రామంలో రైతులకు 50 శాతం రాయితీపై జనుము జీలుగ వచ్చినట్టు విత్తనాలను వ్యవసాయ అధికారి యూ. వసంత రావు ఆధ్వర్యంలో పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటే నరేందర్ రెడ్డి హాజరైయ్యారు. జీలుగా జనము విత్తనాలను వారి చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను పంపిణీ చేస్తుందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ, 30 క్వింటాళ్ల జనుము విత్తనాలు కేటాయించడం జరిగిందని దీనిలో ఇప్పుడు 50 క్వింటాల జీలుగ, 30 క్వింటాల జనుము విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని రేపటి నుండి రైతులు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ను సంప్రదించి పర్మిట్ రాయించుకొని డీసీఎంస్ సెంటర్, జగదేవపూర్ కు వచ్చి రాయితీ పోను జనుము 40 కేజీ బస్తాకు రూ.2510 లు , జీలుగ 30 కేజీ ల బస్తాకు రూ. 2137.5 చెల్లించి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఆలీరాజ్ పేట మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## తడిసిన వరీ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**2 రోజులలో వరి ధాన్యం కొనకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంగం చేస్తాం**

**సిద్ది పేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ నియోజక వర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి గురువారం గజ్వేల్ లో అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. రాష్ట్రంలో పాలన చేతకాక సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేయగా, ప్రభుత్వ యంత్రాంగం అన్ని రంగాల్లో విఫలం చెందిందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. గురువారం గజ్వేల్ పరిధిలోని ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ పుణ్యమా అని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో వేల క్వింటాళ్ల వరి ధాన్యం దిగుబడి రాగా, ఆ పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రోడ్ల వెంట ధాన్యం పుష్కలంగా కనిపిస్తుండగా, లారీలు, గన్ని బ్యాగులు, కూలీల కొరత పేరిట ప్రభుత్వం రైతులను ఆవేదనకు గురి చేస్తుందని ఆరోపించారు. రైతుల ఆగ్రహానికి గురికాకముందే వడగండ్లు, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగా, జీర్ణించుకోలేని కాంగ్రెస్ ఆయనపై అవినీతి మచ్చ వేస్తూ నోటీసులు పంపించడం సిగ్గుచేటని నిలదీశారు. ఇచ్చిన హామీల అమలు, చేసిన తప్పులు సరిదిద్దుకోవాల్సిన రేవంత్ రెడ్డి అవేమీ పట్టించుకోకుండా కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాతల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం కేసీఆర్ చేసిన తప్పా? అని వారు ప్రశ్నించారు. రైతులను తప్పుదోవ పట్టించడం కాకుండా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని లేనిపక్షంలో రైతులతో కలిసి రెండు రోజుల్లో ధాన్యం ట్రాక్టర్లతో రహదారులను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆ పార్టీ నేతలను ప్రజలు చీపుర్లతో నిలదీయాలని కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను సీఎం రేవంత్ రెడ్డి నిలిపివేయగా, పంట రుణమాఫీని పూర్తిస్థాయిలో వర్తింపజేయని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా మాజీ కౌన్సిలర్లు నాయకులు వంటేరు గోపాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య గుంటుకు రాజు నర్సింగరావు భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్, కర్రేగుట్ట లను తక్షణమే ఆపాలి.!

- మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్కౌంటర్ ముమ్మాటికి ప్రభుత్వ హత్యే..!!
- ప్రభుత్వం తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి..!!!

**సిద్ది పేట పవర్** కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్, కర్రేగుట్ట లను తక్షణమే ఆపాలని మరియు నిన్న సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నాంబాల కేశవరావు ను హత్య చేయడాన్ని నిరసిస్తూ మరియు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలంటూ సిద్దిపేటలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నల్ల బాడ్జిలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో మావోయిస్టుల నిర్మూలన పేరుతో భాజపా ప్రభుత్వం అడవులలో ఉన్న సహజ సిద్ధమైన వనరులను కార్పొరేట్ ,బడా పెట్టుబడిదారులకు దారాదత్తం చేయడం కోసం ఆదివాసులను హతమారుస్తున్నారని ,మహిళల పై అత్యాచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసుల హక్కుల కోసం, అడవులలోని సహజ సిద్ధమైన వనరుల పరిరక్షణ కోసం దశాబ్దాల కాలంగా ఉద్యమిస్తున్న మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండపడ్డారు. అనేకమంది అమాయకపు ఆదివాసీ మహిళల పై అత్యాచారం చేస్తూ,ప్రశ్నిస్తున్న వారిని ఎన్కౌంటర్ల పేరుతో చంపుతున్నారని అన్నారు . దేశ హోంశాఖ మంత్రి అమిత్ షా అత్యున్నత స్థాయిలో ఉండి వచ్చే సంవత్సరం మార్చి కల్లా నక్సలైట్లను నిర్మూలిస్తామని ప్రకటించడం అత్యంత సిగ్గుచేటన్నారు. ఉగ్రవాదులతో చర్చలు జరిపే మోడీకి ఈ దేశ పేద ప్రజల కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న మావోయిస్టులతో శాంతి చర్చలు ఎందుకు జరపడం లేదో ప్రజలకు స్పష్టం చేయాలని అన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్, కర్రెగుట్ట లను ఆపి, కేంద్ర బలగాలను వెనక్కి పంపాలని, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు రాగుల భూపతి, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ సత్తయ్య, పీ.డీ.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వి.శ్రీకాంత్, దళిత బహుజన,ప్రజా సంఘాల నాయకులు భీమసేన,రోమాల బాబు, కెవిన్పిఎస్, పిడిఎం, డిబిఎఫ్ ,బీడీఎస్ఎఫ్,రైతు సంఘాల నాయకులు మొగిలి భిక్షపతి,కమలాకర్,కొమ్ము దుర్గారాములు ,దబ్బేట ఆనంద్,యాదగిరి ,శేఖర్, న్యాయవాది విజయ్ కుమార్ మరియు రాజు, రిటైర్డ్ టీచర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు

## సినిమా థియేటర్లు ఎందుకు మూత పడుతున్నాయి..?

**సిద్దిపేట పవర్**

నేడు పసి పిల్లాడి నుండి పండు ముసలివాడి వరకు అందరిపైన అమోగమైన సినిమా ప్రభావం ఉంది. కొన్ని రాజకీయ పార్టీలు అయితే సినిమాల ప్రభావంతో ప్రభుత్వాన్ని స్థాపించాలని చూస్తున్నాయి. ఇప్పుడొస్తున్న సినిమాలు ప్రజలను ఏ విధంగా శాశిస్తున్నాయి అంటే అందులో కొన్ని విలువలను సృష్టించి వాటిని సినిమాల ద్వారా ప్రజల్లోకి పంపించి ఆ సంస్కృతే మనం ఆచరించే సంస్కృతిలా తయారుచేసి ఆచరించేలా చేస్తున్నాయి. ప్రస్తుతం వస్తున్న సినిమాలన్ని కూడా ప్రజల్ని అలరించేలా కాకుండా హీరోల స్థాయి తగ్గకుండా , దిగజారాకుండా మాత్రమే తీస్తున్నారు. కాబట్టి అలాంటి సినిమాలు మార్కెట్ చేసి డబ్బు సంపాదించడానికి తప్ప ఇంకా దేనికీ పనికి రావు. సినిమా అనేది అందమైన అబద్ధం అని , అందమైన అద్దం లాంటిదని నేటి అగ్ర దర్శకులు చెప్తున్నారు కానీ రాబోయే తరానికి ఒక సత్యాన్ని అచ్చం నిజంలా చూపించగలిగే కథలు , దర్శకులు రావాలి అదే రాబోయే తరానికి ఇచ్చే అసలైన అస్త్రం. సినిమా ఇండస్ట్రీ అంతా కొంత మంది చేతుల్లోనే ఉంది.దీనివల్ల అవకాశాలు తగ్గిపోయాయి, ప్రతిభవంతులకు అవకాశాలు వచ్చినా వాటిని నిలదొక్కుకునే స్థాయికి వచ్చే సరికే అది వారి ఖాతాలోకే వెళ్లిపోయేలా చేస్తారు. నేటి సమాజంలో సినిమాలు, థియేటర్లు నడవాలంటే సినిమా తీయ్యాలనే ఆశయమున్న ప్రతీ ఒక్కరికీ అవకాశాలు ఇవ్వాల్సిందే లేదంటే రాబోయో రోజుల్లో సినిమా ఇండస్ట్రీ పూర్తిస్థాయిలో నాశనం అయ్యే అవకాశాలు కూడా మెరుగ్గా ఉన్నాయి.



**రచన**
**శ్యాగ బాబు మహారాజ్**
**7680824200**



## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు. తప్పవు

- సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న సీడ్స్ ఫర్టిలైజర్ షాప్ లో తనిఖీలు నిర్వహించిన టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, అర్బన్ వ్యవసాయ అధికారి శ్రీనాథ్

**సిద్ది పేట పవర్ ప్రతినిధి:** ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులలో తనికీలు నిర్వహించారు ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్, తదితర రికార్డ్స్ తనిఖీ చేసి షాప్ లో ఉన్నా సీడ్స్ ఫర్టిలైజర్ పరిశీలించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు, కాలం చెల్లిన పురుగుమందులు, నకిలీ పురుగు మందులు అమ్మే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరచుగా షాపులను తనిఖీ చేయడం జరుగుతుందని, రైతులను మోసం చేయాలని చూసే షాపు యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని, రైతులు కూడా అప్రమత్తంగా ఉండి వ్యవసాయ అధికారులు సూచించిన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఏ షాపులో కొన్న తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో విడి విత్తనాలు, ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఉన్నట్లు నకిలీ పురుగు మందులు కాలం చెల్లిన పురుగుమందులో విత్తనాలు ఎవరైనా అమ్ముతున్నట్లు సమాచారం వస్తే వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని సూచించారు. లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 కు సమాచారం అందించాలని సూచించారు.



## రెండు నెలల పసికందును అపహరించిన దుండగులు...

**సిద్ది పేట పవర్** తల్లి ఒడిలో ఉన్న రెండు నెలల పసికందును మాస్కులు వేసుకొని వచ్చిన ఇద్దరు దుండగులు అపహరించిన ఘటన దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐవి గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రామగల శ్రీమాన్ అనే యువకుడు తన భార్య కవిత, రెండు నెలల కుమారుడితో అప్పనపల్లి గ్రామంలో గ్యార ఎల్లవ్వ అనే బంధువు ఇంట్లో నివాసముంటు, డెకొరేషన్ వర్క్ చేస్తున్నాడు. ఈనెల 17వ తేదీన పని కోసం శ్రీమాన్ రుద్రారంలో ఉన్న తన అక్క వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి బయట రెండు నెలల కుమారుడిని ఎత్తుకొని ఉన్న కవిత వద్దకు



ఇద్దరు మాస్క్ వేసుకొని వచ్చిన దుండగులు ఆమెతో మాటలు కలిపి, ఆమె ఒడిలో ఉన్న రెండు నెలల పసికందును బలవంతంగా ఎత్తుకొని, ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీంతో ఆందోళన చెందిన తల్లి కవిత ఎంత అరచినా, అక్కడికి ఎవరూ రాలేదు. సమాచారం అందుకున్న బాలుడి తండ్రి శ్రీమాన్ బుధవారం రాత్రి భార్యతో కలిసి దుబ్బాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# సిద్ధిపేట నూతన ఏసీపీ గా బాధ్యతలు చేపట్టిన రవీందర్ రెడ్డి!

**సిద్ధిపేట పవర్:** సిద్ధిపేట నూతన ఏసీపీగా ఈరోజు పదవి బాధ్యతలు చేపట్టిన యం. రవీందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ప్రజాప్రతినిధులు శాంతి భద్రతలకు సహకరించాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు.



# పేకాట స్థావరం పై పోలీసుల దాడి

- గజ్వేల్ ఇన్స్పెక్టర్ బి సైదా
- 29,800 వేల రూపాయలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం


**సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజవర్గం ప్రతినిధి మే:22** గజ్వేల్ పట్టణంలో లక్ష్మి ప్రసన్న కాలనీ రాత్రి 9 గంటల సమయంలో గంగిశెట్టి సంతోష్ ఇంటిలో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా వెళ్లి రైడ్ చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 29,800వేల రూపాయలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. పేకాట ఆడిన వారు దొంతి నర్సింలు తండ్రి జయ రాములు నివాసం మాసాయిపేట, నక్కల వెంకట్ తండ్రి రాములు నివాసం వడ్డేపల్లి, నిరుడి నాగరాజు తండ్రి పోచయ్య నివాసం ఎల్కల్, ఎస్ కె ఫర్దుస్ తండ్రి షఫీ నివాసం అహ్మద్ నగర్ తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు, గజ్వేల్ పోలీసులు మాట్లాడుతూ.. గ్రామాలలో, పట్టణాలలో ఫామ్ హౌస్ లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల ఫోన్ నెంబర్లు 8712667445,8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని గజ్వేల్ ఇన్స్పెక్టర్ బి సైదా తెలిపారు.






# కన్నుల పండువగా 74 అడుగుల గరుడ ఆంజనేయ స్వామి ప్రాణ ప్రతిష్ట మహోత్సవం

- ఏకశిలపై గరుత్మంతుడు హనుమంతుడు ఉన్నటువంటి ఏకైక విశిష్ట దేవాలయం చింతగట్టు దేవాలయం
- ఆలయ ధర్మకర్త బెజగం నర్మదా-రవీంద్ర ప్రసాద్





**సిద్ధిపేట పవర్ నంగునూరు, మే 22:** సిద్ధిపేట జిల్లాలోని తిమ్మాయిపల్లి, కోనాయిపల్లి, బందారం శివార్లలో తెలంగాణ రాష్ట్రంలోని అతి పెద్దదైన 74 అడుగుల గరుడ ఆంజనేయ స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం గురువారం కన్నుల పండువగా సాగింది. వేద పండితుడు శ్రీపాద శర్మ ఆధ్వర్యంలో ఉదయం కాళీమాత పూజ, కాళీమాత ఆవాసనం, గరుడా ఆంజనేయ ప్రాణప్రతిష్ట వేద మంత్రాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం వేదోక్తంగా జరిపారు. అనంతరం భక్తులందరికి తీర్థ ప్రసాదాలను, అన్నప్రసాదాలు అందించారు. అనంతరం వీర ధర్మజస్వామిచే ప్రవచనం చేశారు. గుడి విశిష్టత, హైందవ ధర్మం విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజగామ నర్మద, రవీంద్ర ప్రసాద్, పురోహితులు శ్రీపాద శర్మ పలు గ్రామల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పలు గ్రామాల ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చట్టాలపై టీచర్లకు అవగాహన





**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:**

జిల్లా పరిషత్ హై స్కూల్ రంగదాంపల్లి బయోసైన్స్ టీచర్లకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మహిళల రక్షణ చట్టాల గురించి, ర్యాగింగ్/ ఇవి టీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై మీకు తెలిసిన వారికి మీ బంధువులకు అవగాహన కల్పించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని తెలిపారు. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం. మహిళల భద్రత మా ముఖ్య బాధ్యతని తెలిపారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్టాల గురించి తెలిసి ఉండాలని బాలికల మహిళల రక్షణ గురించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చట్టాలు చేయడం జరిగిందని తెలిపారు. పిల్లలు ప్రతిరోజు ఏం చేస్తున్నారు వారి నడవడికలో ఏమైనా మార్పు ఉంటే గమనిస్తూ ఉండాలని సూచించారు భారతదేశంలో నూతన చట్టాలు జూలై 1 నుండి 2024 అమలు చేయడం జరుగుతుందన్నారు ప్రతి ఒక్కరూ నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు. షీటీమ్ కంప్లైంట్ను కోడ్ గురించి తెలియజేస్తూ ఆన్లైన్ ద్వారా ఎక్కడి నుండి అయిన పిర్యాదు చేసేందుకు ఉపయోగపడే ఈ షీటీమ్ కంప్లైంట్ కోడ్ స్కానింగ్ పోస్టర్స్ ను జిల్లాలో ఆర్టీసీ బస్ లలో, బస్ స్టాండ్ లలో, సినిమా హల్ లు, స్కూల్స్, కళాశాలలు,ఇతర ముఖ్యమైన ప్రాంతాలలో అతికించబడి ఉంటాయని, జిల్లా లో ఎవరైనా బాధిత మహిళలు షీ టీమ్ కు పిర్యాదు చేయదలుచుకున్నప్పుడు ముందుగానే తమ మొబైల్ నందు కోడ్ స్కానర్ ను కలిగి ఉండాలని తమ ఫోన్ తో పోస్టర్ పై ఉన్న కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా తెలంగాణ పోలీస్ లింక్ వస్తుంది దీనిని క్లిక్ చేయగానే పిర్యాదు ఫోరం ఓపెన్ అవుతుంది. అందులోని పేరు, లొకేషన్ తదితర వివరాలను పూరించి సబ్మిట్ చేయగానే జిల్లా పోలీస్ కార్యాలయంలో షీటీమ్ సాఫ్టవేర్ ఐటీ విభాగానికి చేరుతుంది. అక్కడ నిరంతరం పర్యవేక్షించే ఐటీ సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆలొకేషన్ కు దగ్గరలో ఉన్న పోలీస్ అధికారులకు ఫార్వర్డ్ చేయడం ద్వారా సంబంధిత అధికారులు లొకేషన్ కు చేరుకొని తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి వేధింపుల కైన గురయ్యే మహిళలు షీటీమ్ కు పిర్యాదు చేయదలచుకునే మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అంతే కాకుండా మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100, 112, 1098, షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435 హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ 9440700906, 04027852246 ఫోన్ చేసినచో (ఫేస్ బుక్, సిద్ధిపేట స్నేహిత,) (మెయిల్,సిద్ధిపేట స్నేహిత @ జి మెయిల్. కామ్ ), సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బయోసైన్స్ టీచర్లు సిద్ధిపేట షీటీమ్ బృందం ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్ భరోసా సెంటర్ సిబ్బంది హరిత, తదితరులు పాల్గొన్నారు.



# భాగ్యరెడ్డి వర్మకు నివాళి

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:**

పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం రిజర్వ్ ఇన్స్పెక్టర్ విష్ణు ప్రసాద్, ఏఓ యాదమ్మ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏఓ యాదమ్మ, పోలీస్ అధికారులు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ ఒక గొప్ప సంఘ సంస్కర్త, దళిత వైతాళికుడు అని కొనియాడారు. స్వాతంత్ర్యంకు ముందు దళితుల హక్కులు, సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని, హైదరాబాద్ సంస్థానంలో అనేక దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వేల మంది విద్యార్థులకు విద్య అందించి వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడని కొనియాడారు. స్వాతంత్రం రాక ముందే సమాజంలో నెలకొని ఉన్న అనేక సామాజిక వివక్షత లు,అసమానతలు,మూడ నమ్మకాలపై గళమెత్తి పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, రిజర్వ్ ఇన్స్పెక్టర్ విష్ణు ప్రసాద్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, కోర్టు మానిటర్ ఎస్ఐ రాజేష్, సూపరిండెంట్ ఫయాజుద్దీన్, కమిషనర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- డీఏవో రాధిక
- ఎరువులు విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి




**సిద్ధిపేట పవర్ నంగునూరు మే 22:** నకిలీ విత్తనాలను అమ్మకూడదని, ఒకవేళ అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక హెచ్చరించారు. గురువారం నంగునూరు మండల కేంద్రం లోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను గారు తనిఖీలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రాయితీపై రైతులకు పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ భూసారాన్ని పెంపొందించి, నేల యొక్క చౌడుదనం తగ్గించే జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువులు 50 శాతం రాయితీపై నంగునూరు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు పచ్చిరొట్ట పంటలను సాగుచేసి భూసారం పెంచుకోవాలని తెలియజేశారు. జనుము 40 కిలోల సంచి ధర రూ.5,020 ల రాయితీ పోనూ రైతు రూ.2,510లు, జీలుగ 30 కిలోల సంచి ధర రూ.4,275రాయితీ పోనూ రైతు రూ. 2,137.5లు చెల్లించాలని అని చెప్పారు. జనుము, జీలుగ కావలసిన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా ధృవీకరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత, వ్యవసాయ విస్తరణ అధికారి సాయి వర్మ , రైతులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి బియ్యం పంపిణీ

- లయన్స్ క్లబ్ రైస్ బ్యాంక్ చేయూత
- నిత్యవసర సరుకుల అందజేత

**సిద్దిపేట పవర్ చిన్నకోడూరు,మే,22:**

చిన్నకోడూరు మండలంలోని రామంచ గ్రామంలో ఇటీవల మరణించిన నిరుపేద పెద్దెల్లి రాజు కుటుంబానికి సిద్ధిపేట లయన్స్ క్లబ్ అండగా నిలిచింది. ఆ సంస్థ ప్రతినిధులు దాతల సహకారంతో లయన్స్ క్లబ్ రైస్ బ్యాంక్ నుంచి 50 కిలోల బియ్యం, వెయ్యి రూపాయల నిత్యవసర సరుకులను గురువారం అందించారు. దాతలు ఆకుల పాండు, మురికి కాశీనాథ్, గంప రమేష్ ల ఆర్థిక సహాయంతో నిరుపేద కుటుంబానికి ఈ సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జోజి, యాంసాని వెంకట సురేశ్ కుమార్, ఉపాధ్యాయులు వర ప్రసాద్, గ్రామస్తులు పరుశు రాములు, జీవన్ పాల్గొన్నారు.

# శ్రమజీవుల పక్షాన సీపీఐ రాజీలేని పోరాటం

- హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్

**సిద్దిపేట పవర్ చేర్యాల 22మే:** శ్రమజీవుల పక్షాన నిలబడి సీపీఐ రాజీలేని పోరాటం చేస్తుందని, అసంఘటిత రంగాలలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మిక వర్గాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. గురువారం చేర్యాల మండలంలోని రాంపూర్ గ్రామ శాఖ సీపీఐ 2వ మహాసభకు బండారి సిద్దయ్య అధ్యక్షతన నిర్వహించగా ఈ సభకు అందె అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం వల్ల కార్మికులకు భద్రత కరువైందన్నారు. కష్టాన్ని నమ్ముకుని ప్రజా పంపిణీ వ్యవస్థను ముందుకు తీసుకు పోవడంతో హమాలీ కార్మికుడే కీలకమని అన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఏఐటీయూసీ దేశ వ్యాప్తంగా పోరాడుతుందన్నారు. శ్రమజీవులకు ఏ కష్టం వచ్చినా కష్ట జీవుల కమ్యూనిస్టు పార్టీగా సీపీఐ నాటి నుండి నేటి వరకు అండగా నిలబడుతూ 100సంవత్సరాల చరిత్ర కలిగిన గొప్ప పార్టీ సీపీఐ అని అన్నారు. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యపై ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిరుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. గ్రామంలో ఉన్న బీటీ రోడ్డు ధ్వంసమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురైన అనేక సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆకునూర్ నుండి రాంపూర్, నర్సాయపల్లి వయా చేర్యాల వరకు డబుల్ బీటీ రోడ్డు మంజూరు చేయాలన్నారు. రాంపూర్ నుంచి కొత్త దొమ్మాట క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామానికి ఉదయం సాయంత్రం పూట బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు.

**రాంపూర్ గ్రామ శాఖ కమిటీ ఎన్నిక**

సీపీఐ గ్రామ కార్యదర్శిగా బండారి నర్సయ్య, సహాయ కార్యదర్శులుగా మలిపెద్ది నాగభూషణం, బండారి కనకయ్య, కోశాధికారిగా రంగు శంకర్, సోషల్ మీడియా అధ్యక్షునిగా చెట్టే అనిల్, ప్రచార కార్యదర్శిగా బండారి నర్సింహులు, కార్యవర్గ సభ్యులుగా బొప్పనపల్లి బాలేషా, బండారి రాజయ్య, బండారి చంద్రయ్య, మేక కుమార్, బొప్పనపల్లి బాబు, లు ఎన్నికయ్యారు.

